
# ఉభయతారకం



'ఆంధ్రసంఘం - కలకత్తా' వారి సావనీర్ . . . 1998

ఎలాగైతేనేం... మొత్తానికి ఆదినారాయణకి హైదరాబాద్ బదిలీ అయింది!

పన్నెండు సంవత్సరాల పాటు నాగపూర్‌లో ప్రవాసం చేసినా- తెలిసినవాళ్ళు లేక ఇంచుమించు అజ్ఞాతవాసం చేసి, నానా అవస్థలూ పడి, అయినవాళ్ళ చేతులూ, కానివాళ్ళ కాళ్లూ పట్టుకుని రాబర్ట్ బ్రూస్‌ను మించిన ప్రయత్నాలు చేయగా, చేయగా... ఇంత కాలానికి- పుష్కర కాలం పూర్తయ్యాక స్వరాష్ట్రానికి బదిలీ కాగలిగాడు.

ఎంత స్వరాష్ట్రమైనా కొత్త ఊరిలో కుదురుకునేసరికి ఆరునెలలు పైనే పట్టింది.

రాష్ట్రం అయితే సొంతదే కాని, హైదరాబాద్ కాదుగా!

పేరుకి తెలుగువారి రాజధానే కాని, ఇక్కడ తెలుగే వినిపించదు. దాంతో హైదరాబాద్‌లో ఉన్నా పరాయి రాష్ట్రంలో ఉన్నట్లే అనిపించేది. చిత్తూరు జిల్లాలోని ఒక కుగ్రామం నుంచి వచ్చిన తనకు నాగపూర్‌కీ, హైదరాబాద్‌కీ పెద్ద తేడా కనిపించలేదు. అక్కడ స్థానిక భాష మరాఠీ అయినా నలుగురూ ఎక్కువగా మాట్లాడుకునే భాష హిందీ! ఇక్కడ తెలుగు కంటే ఉర్దూకే ఎక్కువ చలామణీ!

ఆరోజు...

ఇంటి నుంచి వచ్చిన ఉత్తరాన్ని చదువుతూ దిగులుపడిపోయాడు ఆదినారాయణ. ఉత్తరాన్ని అలానే చేతిలో పట్టుకుని దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

అదిచూసి సంగతేమిటని అడిగాడు కో-క్లర్క్ రమేష్.

"ఏం లేదు బ్రదర్! మా అమ్మ ఉత్తరం రాసింది. మా నాన్నగారికి నాలుగైదు నెలలుగా వంట్లో బాగుండడం లేదు... ఇప్పుడు బాగా ఎక్కువైందట! ఆయనకి కడుపులో కంతి ఏర్పడిందనీ, అది బాగా పెరిగిందనీ, పగిలిందంటే ప్రమాదమనీ, వెంటనే ఆపరేషన్ చేయడం అవసరమని డాక్టర్లు చెప్పారనీ అమ్మ ఆందోళన పడ్తూ ఉత్తరం రాసింది."

"అలాగా! ఇక్కడికి తీసుకువచ్చి ఆపరేషన్ చేయిస్తే బాగుంటుందిగా! ఇక్కడ ఉస్మానియా ఆస్పత్రి ఉంది. ఇంకా పెద్దపెద్ద ఆస్పత్రులు- మంచివి ఎన్నో ఉన్నాయి. మంచి మంచి స్పెషలిస్టులు ఉన్నారు. అన్నిటికంటే ముఖ్యం... నువ్వు ఇక్కడే ఉన్నావు. మీవాళ్ళకీ ఎక్కడుండాలన్న సమస్య ఉండదు."

"నువ్వు చెప్పేది నిజమే! కాని, మా నాన్నగారు దూరప్రయాణాలు చేయలేరు. పైగా, ఇది మహానగరం! ఇక్కడ తన ముఖం చూసేవాళ్ళు ఎవరుంటారు? పేరుకి ఇక్కడున్నానన్న మాటే కాని, ఇన్నాళ్లయినా ఇప్పటికీ నాకు ఈ ఊరు కొత్తగానే అనిపిస్తుంది."

"మరి, ఏం చేద్దామనుకుంటున్నావు?"

"మాకు వెల్లూరు బాగా దగ్గర! మా చిత్తూరు నుంచి ఇరవై మైళ్లు! అక్కడి ఆస్పత్రి దేశంలోని పెద్ద ఆస్పత్రులలో ఒకటి! అక్కడ మాకు తెలిసిన పెద్దడాక్టర్లు ఉన్నారు. ఏ అవసరం వచ్చినా బంధువులు అందుబాటులో ఉంటారు. అందువల్ల వెల్లూరులో చేయించడమే మంచిదనుకుంటున్నాను."

"అయితే... సెలవు పెట్టున్నావన్నమాట!"

"అవును. ముందు ఓ పదిరోజులు సెలవు పెట్టాను. దానికిముందు డబ్బు చూసుకోవాలి. ఈరోజుల్లో ఆస్పత్రిలో చేరడమంటే వేలమీద ఖర్చు! కనీసం పది, పదిహేను వేలైనా దగ్గరుంచుకోవాలి. మా ఇంటి పరిస్థితి నాకు తెలుసు. అసలు డబ్బు లేకనే ఇంతవరకు ముదరపెట్టుకున్నాడు. మా నాన్నగారు తానుగా ఏదీ అడగడు. తెలుసుకోడానికి నేనెక్కడో నాగపూర్‌లోనో, హైదరాబాద్‌లోనో ఉంటున్నవాడిని. ఇప్పుడైనా అమ్మ రాస్తే తెలిసింది. ఈ ఉత్తరంలో కూడా 'డబ్బు చూసుకోవాలి' అని రాసిందే కాని- ఇంత కావాలని కాని, వీలున్నంత తీసుకుని రమ్మని కాని రాయలేదు. నేనే వీలున్నంత తీసుకువెళ్లాలి. నా ప్రావిడెంట్ ఫండ్‌లో ఇరవై వేలు పైనే ఉంది. లోన్‌కి అప్లయ్ చేస్తాను. అది రాగానే బయలుదేరుతాను."

"అదంతేలే... వారం కూడా పట్టదు. శాన్క్షనింగ్ ఆఫీసు ఈ ఊళ్లోనే ఉందిగా! స్వయంగా వెళ్లి రిక్వెస్టు చేసుకుంటే రెండురోజుల్లో వస్తుంది."

"అవును. అలాగే చేయాలనుకుంటున్నాను..." అన్నాడు ఆదినారాయణ.

●

"గుడ్ మార్నింగ్ సర్!"

- అంటూ డైరెక్టర్‌గారి గదిలోకి ప్రవేశించాడు ఆదినారాయణ.

ఏదో ఫైల్‌ని చూస్తున్న హనుమాన్ చౌదరిగారు తలెత్తి చూసి, కూర్చోమన్నట్లు కుర్చీవైపు చేయి చూపించాడు.

ఆదినారాయణ ఇబ్బందిగా కూర్చున్నాడు.

"సార్... నా పేరు ఆదినారాయణ! బి-సెక్షన్‌లో పనిచేస్తున్నాను."

"యస్... యస్... ఐ నో! నాగపూర్ నుంచి వచ్చారు కదా! చెప్పండి ఏం కావాలో?"

"మా నాన్నగారికి హెల్త్ బాగుండలేదు. వెల్లూరుకి తీసుకువెళ్లి ఆపరేషన్ చేయించాలి."

"లీవ్ అప్లికేషన్ స్టాఫ్ సెక్షన్‌లో ఇయ్యండి... గ్రాంట్ చేస్తాను."

"థాంక్యూ సర్! కాని, ఒక మేజర్ ప్రాబ్లెం వచ్చింది. మీ హెల్ప్‌కోసం వచ్చాను."

చౌదరిగారు ప్రశ్నార్థకంగా ఆదినారాయణ వంక చూశారు.

"ఆపరేషన్ అంటే ఏ సమయానికి ఏ అవసరం వస్తుందో చెప్పలేం! కనీసం పది, పన్నెండు వేలైనా దగ్గర ఉంచుకోవాలి. అందుకని ప్రావిడెంట్ ఫండ్ లోన్‌కి అప్లయ్ చేశాను."

"మీ అప్లికేషన్ నాకేమీ రాలేదే! ఉండండి... ఈ ఫైల్స్‌లో ఉందేమో చూస్తాను" అంటూ టేబుల్ మీదున్న ఫైల్స్‌ను చూడబోయారు చౌదరిగారు.

"సార్... సార్... ఇంకా సెక్షన్‌వాళ్ళు పుటప్ చేయలేదు. నేను నాగపూర్ నుంచి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాను కదా! ఆర్నెల్లు దాటినా, నా ప్రావిడెంట్ ఫండ్ బ్యాలన్స్ ఇంకా ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ కాలేదట! ఆ ఆడిట్ సర్కిల్ వేరు. ఈ ఆడిట్ సర్కిల్ వేరు. ఆ బాలన్స్ రాలేదు కాబట్టి ఆ బాలన్స్‌ని మన హైదరాబాద్ ఆడిట్ సర్కిల్ సర్టిఫై చేయడం లేదు. వాళ్ళు సర్టిఫై చేస్తే కాని మన ఆఫీసులో పుటప్ చేయరు."

"అరేఁ... మరి, ఇప్పుడేమిటి చేయడం?"

మామూలుగా ఆఫీసర్‌లు సీటులో కూర్చున్నప్పుడు పులిలా ఉంటారు. పలుకే బంగారమన్నట్లు ముభావంగా ఆచితూచి మాట్లాడుతారు. నగుమోము చూపితే నెత్తికెక్కుతా రేమోనన్న భావంతో గంభీరంగా ముఖం పెట్టుకు కూర్చుంటారు. అందుకు విరుద్ధంగా చౌదరిగారు మనసున్న మనిషిలా, సహాయం చేసే గుణం ఉన్నవాడిలా మాట్లాడేసరికి ఆదినారాయణకు ధైర్యం వచ్చింది.

"సార్... ఇఫ్ యూ డోన్ట్ మైండ్- యూ కెన్ హెల్ప్ మి సార్! నా ప్రావిడెంట్ ఫండ్ బ్యాలన్స్ ఇరవైవేలు పైన ఉంది. నేను జాగ్రత్తగా అక్కౌంట్ మెయింటైన్ చేసుకుంటున్నాను. ఇదిగో... దీన్ని చూస్తే మీకే అర్థమవుతుంది. దీని బేసిస్ మీద మీరు లోన్ శాంక్షన్ చేస్తే నాకు చాలా సహాయం చేసినవారవుతారు!"

– అంటూ జేబులోంచి ఒక నోట్ పుస్తకం తీసి చూపించబోయాడు.

"చూడండి మిస్టర్ ఆదినారాయణా! మీ మాట మీద నాకు నమ్మకం ఉంది. కానీ, మీ ప్రైవేట్ అక్కౌంట్ ఆధారంతో నేను లోన్ ఎలా శాంక్షన్ చేయగలను? దటీజ్ ఇంపాజిబుల్! ఇటీజ్ నాట్ కరెక్ట్ ఆల్సో! ఐ కెన్ డూ ఎనీథింగ్ వితిన్ ది ఫ్రేం వర్క్ ఆఫ్ రూల్స్ ఓన్లీ!" అన్నాడు.

'రూలు ప్రకారం అన్నీ సరిగ్గావుంటే ఇంక ఈయన చేయడంలో గొప్పేముంది?' అని మనసులో అనుకుని, "సార్... సార్..! మీరలా అంటే చాలా ఇబ్బంది పడిపోతాను సార్! ఈ లోన్ వస్తుందన్న ఆశతో అన్ని ఏర్పాట్లు చేసుకోమని మావాళ్ళకి ఉత్తరం కూడా రాశాను" అన్నాడు ఆదినారాయణ ఆందోళనతో.

"డోన్ట్ కంపెల్ మి మిస్టర్ ఆదినారాయణా! మీకోసం నేను చేయగలిగింది మీ బ్యాలన్స్ తొందరగా ట్రాన్స్‌ఫర్ అయ్యేట్లు చూడడం! అందుకోసం ఇప్పుడే నాగపూర్‌కి యస్.టి.డి.లో మాట్లాడుతాను. మీ అక్కౌంట్ డిటైల్స్ ఇవ్వండి."

ఆ నోట్‌బుక్ ముందు పెట్టూ, "సార్... అలా అయి కూడా అది పోస్టులో రావడానికి మూడురోజులైనా పట్టుంది. ఆలస్యం అయితే నేను చాలా ఇబ్బందిలో పడిపోతాను..." అంటూ ప్రాధేయపడ్డాడు ఆదినారాయణ.

"చెప్పాను కదా... నన్ను బలవంతం చేయవద్దని! ఐ విల్ డూ మై బెస్ట్! ఆс... ఇంతకీ, మీరెప్పుడు రిలీవ్ కావాలనుకుంటున్నారు?"

"ఎల్లుండి ఈవెనింగ్ సార్!"

"సరే... మంచిది! రేపు సాయంత్రం నాకోసారి కనిపించండి. ఇలా అన్నానని నామీద హోప్స్ పెట్టుకోకండి. యూ హావ్ టు మేక్ యువరోన్ ఎఫర్ట్స్! యుకెన్ గో!" అన్నారు చౌదరిగారు.

డైరెక్టర్‌గారికి 'థాంక్స్' చెప్పి బయటపడ్డాడు ఆదినారాయణ. అతని మనసు అల్లకల్లోలంగా ఉంది.

'దగ్గర డబ్బు లేకుండా ప్రయాణం కావడం ఎంత కష్టం?!

ఖర్మ కాకపోతే డబ్బు ఉండికూడా అందుబాటులో లేకపోవడమేమిటి? గవర్నమెంట్ రెడ్‌టేపిజం ఎప్పటికి పోతుందో?!

చౌదరిగారు ఈరోజు ఫోన్లో మాట్లాడితే ఎప్పుడొస్తుంది? పోనీ, స్వయంగా వెళ్లి తెచ్చుకుందామనుకున్నా ఈ తతంగమంతా అయ్యేసరికి కనీసం వారం పడుతుంది. ఈలోపల తండ్రి పరిస్థితి ఎలా ఉంటుందో? డబ్బు రావడం ఆలస్యం అవుతోందని ఆపరేషన్ వాయిదా వేయించలేం కదా!

ఇటువంటి సమయంలో కూడా ఆఫీసర్‌లు తమ డిస్క్రిషన్‌ని ఉపయోగించకపోతే ఇంకెందుకు? ఆయన లోన్ శాంక్షన్ చేస్తే అడిగే వారెవరు? ఒకవేళ పొరపాటున ఎక్కువ పేమెంట్ అయిందనే అనుకుందాం... అంతలో కొంపేమి మునుగుతుంది? తన

జీతంలోంచి పట్టుకుంటారు... అంతేగా! తానేమైనా ఉద్యోగం వదిలి పారిపోతున్నాడు కనుకనా? ఈ ఆఫీసర్లు అంతా ఇంతే! కొందరు చెప్పకుండా గొంతు కోస్తే- కొందరు తియ్యగా మాట్లాడుతూ మొండిచేయి చూపుతారు...'

- పరిపరి విధాల ఆలోచనలతో ఇల్లు చేరాడు ఆదినారాయణ.

ఆఫీసర్‌గారు కోరిన ప్రకారం మర్నాడు సాయంత్రం ఆయన ఛాంబర్‌లోకి వెళ్లాడు ఆదినారాయణ.

చౌదరిగారు ఫోన్లో మాట్లాడాడనీ, వాళ్ళు పంపిస్తున్నామని చెప్పారనీ చెప్తూ... డ్రాయర్‌లోంచి ఆయన నోట్‌బుక్ తీసి ఇచ్చాడు.

మౌనంగా నిలబడిపోయాడు ఆదినారాయణ.

"చూడండి మిస్టర్ ఆదినారాయణ! అనుకోని డెవలప్‌మెంట్ ఒకటి వచ్చింది. అర్జంట్‌గా వరంగల్‌కి నెలరోజులు డెప్యుటేషన్ మీద ఒక మనిషిని పంపవలసి వచ్చింది. దానికి తగినవాళ్ళు మీరు తప్ప వేరెవరూ కన్పించలేదు. అందువల్ల మిమ్మల్ని వరంగల్‌కి టెంపరరీ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాను. ఇవిగో... ఆర్డర్స్! బట్... డోన్ట్‌వర్రీ! మీరు మీ ఊరికి పోయి తిరిగివచ్చి ఇక్కడ జాయిన్ అయ్యాక రిలీవ్ కావచ్చు. మీరు ఇమ్మీడియట్‌గా ఒక నెల జీతం అడ్వాన్సుగా తీసుకోండి. అలాగే టి.ఎ. అడ్వాన్స్ ఫర్ ఆర్డర్స్‌లోనే ఈ రెండు అడ్వాన్సుల ఆర్డర్స్ వేశాను!" అంటూ ఆర్డర్ చేతిలో పెట్టాడు.

ఆదినారాయణ నెత్తిన మబ్బులేని పిడుగు పడినట్లయింది.

'గోరుచుట్టు మీద రోకటి పోటు లాగా, మూలిగే నక్క మీద తాటిపండు లాగా ఈ ఉత్పాతం ఏమిటి? చుట్టమనుకుని వెళ్తే దయ్యమై పట్టుకున్నట్లు- సహాయం కోరి వెళ్తే ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇదేమి పాపంరా బాబూ..!' అని మనసులోనే కుమిలిపోయాడు. నోట మాట రాక మ్రాన్పడిపోయాడు. కొంచెం తేరుకుని-

"సార్... పన్నెండేళ్ల తర్వాత నానా అవస్థలు పడి ఇక్కడికి వచ్చాను. వచ్చి గట్టిగా ఆరునెలలు కాలేదు. అప్పుడే ట్రాన్స్‌ఫరా? అందులోనూ వరంగల్‌కా?" అంటూ మొత్తుకోసాగాడు.

"మిస్టర్ ఆదినారాయణా! యు మస్ట్ టేకిట్ ఈజీ! ఇది సర్వీసు... అంతా మనమంచికే అనుకోవాలి. ఆ విశ్వాసం ఉన్నప్పుడు పైకి చేదుగా కనిపించేదాని వెనక కూడా ఎంతో మంచి దాగుని ఉంటుంది. మీరు అనవసరంగా దిగులు పడ్తున్నారు కాని, ఈ ట్రాన్స్‌ఫర్ మీకు హెల్పింగ్ ఇన్ డిస్‌గైజ్! ఇప్పుడు చూడండి... మీకు అడ్వాన్సులుగా

పది, పన్నెండు వేలు చేతిలో పడ్తాయి. పి.యఫ్. లోన్ వచ్చేవరకూ వేచి ఉండనక్కరలేదు. ఈ డబ్బుతో ముందు మీ ఊరెళ్లి మీ నాన్నగారి ఆపరేషన్ సంగతి చూసుకుని రండి! మిగతా విషయాలు అప్పటి పరిస్థితులు బట్టి ఆలోచిద్దాం!" అన్నారు చౌదరిగారు.

'ఈయనకేం..? కడుపు నిండిన పెద్దమనిషి... కబుర్లు ఎన్నైనా చెప్తాడు! పోన్లే... ఆయనన్నట్లు ట్రాన్స్‌ఫర్ మాట ఎలావున్నా ముందు డబ్బు సమస్య తీరింది!' అని మనసులో అనుకున్నాడు ఆదినారాయణ.. వెంటనే వెళ్లి ఆ అడ్వాన్సులు తీసుకున్నాడు.

ముందు నిర్ణయించుకున్న ప్రకారం మర్నాడే ఊరు వెళ్లాడు ఆదినారాయణ. వెల్లూరు ఆస్పత్రిలో తండ్రిని చేర్పించాడు.

ఆపరేషన్ విజయవంతంగా జరిగింది.

పదిహేను రోజుల తర్వాత హైదరాబాద్‌కి తిరిగివచ్చి డ్యూటీలో చేరాడు. ఇంక ఒకటి రెండురోజుల్లో వరంగల్ కోసం రిలీవ్ చేస్తారని దిగులుపడసాగాడు. నిష్కారణంగా తనకు అంతటి అపకారం చేసిన చౌదరిగారి ముఖం చూడబుద్ధి కాలేదు అతనికి.

ఆ సాయంత్రం డైరెక్టర్‌గారి దగ్గర్నుంచి పిలుపు వచ్చింది ఆదినారాయణకి.

'ఇంకెందుకు? తొందరగా రిలీవ్ చేయడం కోసమే పిలిచి ఉంటాడు. ఇటువంటి ఆఫీసర్ దగ్గర అనవసరంగా నా కష్టాన్ని చెప్పుకొని సహాయం కోరినందుకు నన్ను నేను చెప్పుచ్చుకొని కొట్టుకోవాలి!' అనుకుంటూ లేచి, తడబడుతున్న గుండెలతో డైరెక్టరుగారి గదిలో అడుగుపెట్టాడు.

చౌదరిగారు చిరునవ్వు ముఖంతో– "మిస్టర్ ఆదినారాయణ! ఎప్పుడు జాయిన్ అయ్యారు?" అని అడిగారు.

ఆదినారాయణకి కడుపు రగిలిపోయింది.

'శాడిస్టు వెధవ! చేసే అపకారం చేసి, ఏమీ ఎరగనట్లు చిద్విలాసంగా ఎలా చిరునవ్వు నవ్వుతున్నాడు?! పాపం మూటకట్టుకుని వీడేం బాగుపడ్తాడులే!'

పైకి ఏమీ కక్కలేక, "ఈరోజు ప్రొద్దున్నే సార్!" అన్నాడు.

"మీ నాన్నగారికి ఎలా ఉంది?"

'వెధవ కుశలప్రశ్నలూ, వీడూను... పిర్ర గిల్లి జోకొట్టున్నాడు! పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణసంకటం! పుండు మీద కారం రాయడమంటే ఇదే!' –తనకి తెలిసిన సందర్భోచిత సామెతలన్నీ గుర్తుకివచ్చాయి ఆదినారాయణకి.

"కులాసాగానే ఉంది సార్! మొన్ననే డిశ్చార్జి చేశారు. ఇంటికి తీసుకువచ్చాం!"

"మరి, ఈ గుడ్‌న్యూస్ నాకు చెప్పలేదేం?" కొంటెగా నవ్వుతూ అడిగారు చౌదరిగారు.

ఆదినారాయణ ఏమీ మాట్లాడలేదు. ఆయన అనునయ వాక్యాలు వింటుంటే అతనికి వళ్ళు మండిపోతోంది. ఈడ్చిపెట్టి ముక్కుమీద ఒక్క గుద్దు గుద్దాలనిపిస్తోంది. 'ఆ ఇచ్చే ఆర్డర్స్ ఏవో తొందరగా ఇచ్చేసి పంపించేయక ఈ నాన్పుడు వ్యవహారం ఎందుకు?' అనుకున్నాడు.

"మిస్టర్ ఆదినారాయణా! మిమ్మల్ని వరంగల్‌కి టెంపరరీ ట్రాన్స్‌ఫర్ చేశాను. జ్ఞాపకం ఉందిగా!" అన్నారు చౌదరిగారు.

"యస్ సార్... వెళ్లడానికి సిద్ధంగానే ఉన్నాను!" ఎలాగూ ఉరి తప్పనప్పుడు నవ్వుతూ ఉరికంబం ఎక్కడం మంచిదనిపించింది.

"రియల్లీ... సో యూ ఆర్ ప్రిపేర్డ్ ఫర్ గోయింగ్?"

"కాక చేసేదేముంది లెండి! ఉద్యోగంలో చేరాక నా ఇష్టాయిష్టాలతో పనేమి ఉంటుంది?" ఆవేశాన్ని ఎంత అణచుకుంటున్నా నిష్ఠూరంగానే మాటలు వచ్చాయి.

"మిస్టర్ ఆదినారాయణా... గుడ్‌న్యూస్ ఫర్ యూ! మీ ట్రాన్స్‌ఫర్ క్యాన్సిల్ అయింది. మీ ప్రావిడెంట్ ఫండ్ బ్యాలన్స్ కూడా వచ్చింది. మీ లోన్ శాంక్షన్ చేశాను. ఆ ఎమౌంట్ తీసుకుని మీరు తీసుకున్న అడ్వాన్సులు తిరిగి కట్టేయండి. విషయూ ఆల్ ది బెస్ట్!" అన్నారు చౌదరిగారు.

ఆదినారాయణ తన చెవులను తాను నమ్మలేకపోయాడు. సంభ్రమాశ్చర్యాలతో కొయ్యబారిపోయాడు. ఏమీ మాట్లాడలేక "థాంక్స్ సార్!" అని బయటకు వచ్చాడు. అతని మనసు ఆనందంతో తేలిపోతోంది.

సెక్షన్‌లోకి వెళ్లగానే రమేష్‌తో-

"నా ట్రాన్స్‌ఫర్ క్యాన్సిల్ అయింది. చౌదరిగారే చెప్పారు. ఐయామ్ రిలీవ్డ్ ఆఫ్ మై టెన్షన్!" అన్నాడు ఉరకలు వేస్తున్న ఉత్సాహంతో.

"అలాగా... నీ ట్రాన్స్‌ఫర్ క్యాన్సిలయిందా?" అంటూ నవ్వాడు రమేష్.

ఆ నవ్వులో కొంటెతనం కనిపించింది. ప్రశ్నార్థకంగా రమేష్ వంక చూశాడు ఆదినారాయణ.

"నీ ట్రాన్స్‌ఫర్ నాటకానికి సూత్రధారీ, అందులో పాత్రధారీ మన డైరెక్టర్ హనుమాన్ చౌదరిగారే! సాధారణంగా మన ఆఫీసర్లలో చాలామంది నెగెటివ్ అప్రోచ్‌తో

ఉంటారు. ఎవరికైనా సహాయం చేయాలంటే తమ సొమ్మేదో పోయినట్లు బాధపడ్తారు. ఇతరులకి- ముఖ్యంగా... 'తమ క్రింది ఉద్యోగులకి సహాయం చేయగల అవకాశం తమకి ఉండడం ఒక వరం!' అని అనుకోరు.

అధికారం ఉంది కదా... అని తమ క్రింది ఉద్యోగులను నానాబాధా పెడ్తారు. అయితే 'పురుషులందు పుణ్యపురుషులు వేరయా!' అన్నట్లు- ఆఫీసర్‌లలో కూడా గొప్ప సహాయ గుణం, ఉదార బుద్ధి ఉండే ఆఫీసర్‌లూ కొందరుంటారు. కొందరు ధైర్యం చేసి రూల్సుకి విరుద్ధంగానైనా సహాయం చేస్తారు, మరికొందరు రూల్సుకి ఎంతమాత్రం విరుద్ధంగా పోరు. కాని, వాళ్ళలోని సహాయక గుణం వారిని ఊరుకోనీయదు. రూల్స్‌కి భంగం రాకుండా, ఇతరులకు సహాయం అందేటట్లు మార్గాలను ఏర్పరచుకుంటారు.

మన డైరెక్టర్‌గారు ఈ వర్గానికి చెందినవారు. నీకు సహాయం చేయాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకున్నాడు. కానీ, నీ బ్యాలన్స్ సర్టిపై కానిదే నీ లోన్ ఆయన శాంక్షన్ చేయలేదు. ఎందుకంటే... అది రూల్స్‌కి విరుద్ధం! అయితే ట్రాన్స్‌ఫర్ చేయడానికీ, అడ్వాన్స్‌లు ఇయ్యడానికీ ఆయనకి అధికారం ఉంది. అందుకే ఈ ట్రాన్స్‌ఫర్ డ్రామా ఆడి, నీకు అడ్వాన్స్‌ల రూపంలో కావలసిన ధనసహాయం చేసి ఆదుకున్నాడు. నీ పి.యఫ్. బ్యాలన్స్ త్వరలో వచ్చేటట్లు చేసి నీలోన్ శాంక్షన్ చేసి సిద్ధంగా ఉంచాడు. నువ్వు తిరిగి రాగానే నీ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ క్యాన్సిల్ చేసి నాటకాన్ని ముగించాడు. 'అన్నీ వున్న విస్తరి అణిగిమణిగి ఉంటుం'దన్నట్లు- ఆయన పైకి కనిపించకుండా అవసరమైన సహాయం చేస్తుంటాడు" అంటూ చిన్నసైజు ఉపన్యాసం ఇచ్చాడు రమేష్.

ఆదినారాయణకి ఆనాడు చౌదరిగారు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ చేతిలో పెట్తూ అన్న మాటలు గుర్తుకి వచ్చాయి...

"అర్జంటుగా వరంగల్‌కి ఒక మనిషిని పంపవలసి వచ్చింది. తప్పనిసరిగా మిమ్మల్ని పంపుతున్నాను. అయినా... మీరు లీవ్ నుంచి తిరిగి వచ్చాక వెళ్ళి జాయిన్ అవవచ్చు!" అన్నాడు. మరి, అర్జెంట్ ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు అన్ని రోజులు పెండింగ్‌లో పెట్టడం ఎలా కుదురుతుంది?

ఆయన మరో మాట కూడా అన్నారు... "అంతా మన మంచికే ననుకోవాలి. ఆ విశ్వాసం ఉన్నప్పుడు నీకు చెడుగా కనిపించేదాని వెనక కూడా ఎంతో మంచి దాగుండి ఉంటుంది. మీరు అనవసరంగా దిగులుపడ్తున్నారు. ఈ ట్రాన్స్‌ఫర్ మీకు హెల్పింగ్ ఇన్ డిస్‌గైజ్!" అని!

ఆయన మాటలకి, చేతలకి అర్థం ఇప్పుడు బోధపడ్తోంది. కొంచెం స్తిమితంగా ఆలోచించివుంటే ఆ అంతరార్థం ఆనాడే తెలిసి ఉండేది. కాని, తన ఆవేదన ఏ ఆలోచననీ రానీయలేదు. నిజంగా ఆయన ఎంతటి ఉన్నతమైన వ్యక్తి! తానెంత తప్పుగా అర్థం చేసుకున్నాడు?

రమేష్ వివరణ విన్నాక– శ్రీకృష్ణ భగవానుడు అర్జునుని గీతా రహస్యాన్ని విడమర్చి చెప్పినట్లు హనుమాన్ చౌదరిగారి విశ్వరూపం ఆదినారాయణ కళ్ళముందు మెదిలింది.

'నొప్పింపక, తానొవ్వక' అన్నట్లు రూల్స్‌కి భంగం రాకుండా, తనకి సహాయమూ జరిగేటట్లుగా ఉభయతారకంగా ప్రవర్తించిన చౌదరిగారికి మనసులోనే ప్రణమిల్లాడు ఆదినారాయణ.

'ఆంధ్రసంఘం - కలకత్తా' వారి సావనీర్ . . . ***1998***

అమ్మకానికి అందుబాటులో ఉన్న
కె.ఆర్.కె. మోహన్ ఇతర రచనలకై ఈ పుస్తకం చివరి పేజీల్లో చూడండి...